# పాలకుర్తి వాణి

మన పల్లె.. మన ముచ్చట్లు



WANTED విలేకరులు కావలెను

పాలకుర్తి వాణి దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, మండల విలేకరులు కావలెను. తెలుగు భాషపై పట్టు, ప్రజా సమస్యలు, సమకాలీన రాజకీయాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి ఇదే మా ఆహ్వానం..

9866366702, 9963261745



సంపుటి : 01 | సంచిక : 30 | వరంగల్ | బుధవారం, 08 అక్టోబర్ 2025 | పేజీలు : 03


# బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి..

- పాలకుర్తిలో భారీగా చేరికలు
- ఆహ్వానించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**పాలకుర్తి వాణి, పాలకుర్తి :**
పాలకుర్తి నియోజవర్గంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరికల పరంపర కొనసాగుతోంది. దేవరుప్పుల మండలంలోని లక్ష్మణ్ తాండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు బానోతు సుజాత, బానోత్ శోభ, భీమిలి, బికోజి, అలాగే రాయపర్తి మండలం మహబూబ్నగర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు బిరామనేని అశోక్, బొమ్మిడినేని రమేష్, శ్రీకాంత్, శ్రీలత, రజిని, శ్యామల, తదితరులు బీఆర్ఎస్-పార్టీలకు రాజీనామా చేసి, కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి వారందరికీ కాంగ్రెస్ కండువా కప్పి, పార్టీకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆశలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం, మహిళా సాధికారత ఇవే మా ప్రధాన లక్ష్యాలు. ఈ నమ్మకం కారణంగానే ప్రజలు ఇతర పార్టీలను విడిచి కాంగ్రెస్ వైపు వస్తున్నారని, అని పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కోసం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో ఉండి పనిచేయాలి. ప్రతి గ్రామంలో పార్టీ బలాన్ని పెంచి, కాంగ్రెస్ పతాకాన్ని ఎగురవేయాలని పిలుపునిచ్చారు .







## పక్కా ప్రణాళికలతో అడుగులు

- డిప్యూటీ తహసీల్దార్‌గా ఎస్సై కూటికంటి శివ
- గతంలో ఐదు కొలువులు సాధించిన శివ
- గ్రూప్ 2 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 25వ ర్యాంకు
- ప్రజలకు సులభతర సేవలు అందిస్తానని వెల్లడి

2లో



## లొంగిపోయిన మావోయిస్టు రూబెన్

- వివరాలు వెల్లడించిన వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

2లో


# పక్కా ప్రణాళికలతో విజయం వైపు అడుగులు

- డిప్యూటీ తహసీల్దార్‌గా ఎస్సై కూటికంటి శివ
- గతంలో ఐదు కొలువులు సాధించిన శివ
- గ్రూప్ 2 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 25వ ర్యాంకు
- ప్రజలకు సులభతర సేవలు అందిస్తానని వెల్లడి



**పాలకుర్తి వాణి, ప్రత్యేక ప్రతినిధి :** టీజీపీఎస్సీ ఇటీవల విడుదల చేసిన గ్రూప్ 2 ఫలితాల్లో పాలకుర్తి మండలం తిరుమలగిరికి చెందిన కూటికంటి శివ డిప్యూటీ తహసిల్దార్ గా ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో 25వ ర్యాంకు సాధించారు. ప్రస్తుతం శివ మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ విజయం తన తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే లభించిందని... ఆయన ఆనందం వ్యక్తం చేశారు. శివ తల్లిదండ్రులు కూటికంటి లక్ష్మి, వెంకన్న దంపతులు.. కుమారుడికి నాయబ్ తహసీల్దార్ ఉద్యోగం రావడంపై హర్షం వ్యక్తం చేశారు. శివ గ్రూప్ 2 ఉద్యోగం కోసం ఎంతో కష్టపడ్డారు. చిన్నప్పటి నుంచి చదువులో చురుకుగా ఉండే ఆయన.. వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుకున్నారు. హైదరాబాద్ లో గురునానక్ కాలేజీలో ఈసీఈ(బీటెక్) 2017లో పూర్తి చేసి... అనంతరం ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యారు. 2018లో మొదటగా ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియాలో గ్రేడ్4 ఉద్యోగం వచ్చింది. తర్వాత ఎస్సైకి ప్రిపేర్ తో.. అదే సమయంలో 2019లో ఆర్పీఎఫ్ ఎస్సై ఉద్యోగం వచ్చింది. కానీ అది కర్ణాటక రాష్ట్రంలో చేయాల్సి రావడంతో చేరలేదు. ఆ తర్వాత గ్రూప్4, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, వీఆర్వో ఉద్యోగాలు వచ్చాయి. వాటిలోనూ చేరలేదు.

2019లో తెలంగాణ పోలీసు శాఖలో సివిల్ ఎస్సై ఉద్యోగం వచ్చింది. ఇష్టమైన ఉద్యోగం కావడంతో 2020లో ట్రైనింగ్ పూర్తి చేసి.. మొదటగా ట్రైనీ ఎస్సైగా మంచిర్యాల జిల్లా నిల్వాయి, దండేపల్లిలో పని చేశారు. అనంతరం 2022లో మహబూబాబాద్ టౌన్ ఎస్సైగా ట్రాన్స్ఫర్ వచ్చింది. దీంతో ప్రస్తుతం ఇక్కడా విధులు నిర్వహిస్తున్నాను. 2022లో గ్రూప్2 ప్రకటన వెలువడటంతో ఉద్యోగానికి సెలవు పెట్టి మరీ ప్రిపేర్ అయ్యారు. దృఢ నిశ్చయంతో అనుకున్న లక్ష్యం వైపు అడుగులు వేసి.. గ్రూప్2లో 410 మార్కులు సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా 25వ ర్యాంకు దక్కింది.



## ఎంపీటీసీ, జడ్పీటీసి ఎన్నికలకు మొదటి ర్యాండమైజేషన్

**పాలకుర్తి వాణి, జనగామ :** జిల్లాలో 12 మండలాల లోని 12 జడ్పీటీసీ స్థానాలకు, 134 ఎంపీటీసీ ఎన్నికల సిబ్బంది ఎంపిక సందర్భంగా మొదటి ర్యాన్డమైజేషన్ ప్రక్రియను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ నిర్వహించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఎంపిటిసి, జడ్పీటీసి ఎన్నికల నిర్వహణకు మొదటి ర్యాన్డమైజేషన్ ప్రక్రియను సంబంధిత జడ్పి అధికారులు, ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్షించారు.ఎన్నికల నిర్వహణకు గాను పి.ఓ.లుగా 940, ఏ.పి.ఓ.లుగా 940, పోలింగ్ అధికారులుగా 2373 మందిని ఎంపిక చేశారు. ఎంపిక చేసిన ఎన్నికల అధికారులకు ఎన్నికల నిర్వహణ పై మండల కేంద్రాలలో ఈ నెల 19 వ తేదీన శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పి సి.ఈ.ఓ.మాధురీ షా, డిప్యూటీ సి.ఈ.ఓ. సరిత, డి.పి.ఓ.స్వరూప, డి.ఎల్.పి.ఓ. వెంకటరెడ్డి, ఈడీఎం గౌతమ్, మాస్టర్ ట్రైనీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ విద్యార్థులకు వృత్తి విద్య శిక్షణ

**పాలకుర్తి వాణి, భీమదేవరపల్లి :** వృత్తి విద్యలో భాగంగా హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు ఆదర్శ పాఠశాల విద్యార్థులు క్షేత్రస్థాయిలో శిక్షణ పొందుతున్నారు. పాఠశాలలో పర్యాటక వసతి నిర్వహణ, సౌందర్య సంరక్షణ అనే రెండు వృత్తి విద్యా కోర్సులు అమలులో ఉన్నాయి.ఇందులో భాగంగా పర్యాటక విభాగ విద్యార్థులు హుజూరాబాద్‌లోని శ్రీరామ హోటల్ నిర్వహణ కళాశాలలో పది రోజుల శిక్షణ పొందుతుండగా, సౌందర్య సంరక్షణ కోర్సు విద్యార్థులు హనుమకొండలోని కట్స్ అండ్ కర్ల్స్ సౌందర్య కేంద్రంలో శిక్షణ పొందుతున్నారు. ఈ శిక్షణ విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందని అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.



### నిషేధిత మావోయిస్టు డివిజన్ కమిటీ కార్యదర్శి

# సీపీ ఎదుట లొంగుబాటు

### రూబెన్ పై 8 లక్షల రివార్డు

పాలకుర్తి వాణి, హనుమకొండ: నిషేదిత సి.పి.ఐ మావోయిస్టు పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి, సౌత్ బస్తర్, డివిజనల్ కమిటీ సభ్యుడు, దండాకారుణ్య స్పెషల్ జోనల్ కమిటీ కి చెందిన మంద రూబెన్@ కన్నన్న@ మంగన్న @సురేష్ (67) వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఎదుట మంగళవారం లొంగిపోయాడు. వివరాలను సిపి వెల్లడిస్తూ.. హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం వంగపాడు గ్రామానికి చెందిన మంద రూబెన్ 1979లో కాజీపేటలోని ఆర్.ఈ.సిలో హాస్టల్ మెస్ విభాగంలో పని చేశాడు. ఆ సమయంలో రాడికల్స్ యూనియన్స్ నిర్వహించే సంస్కృతిక కార్యక్రమాలకు ఆకర్షితుడై మావోయిస్టు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు పిలుపు మేరకు మావోయిస్టు పార్టీ లో చేరి అజ్ఞతంలోని వెళ్ళిపోయాడు. 1981 నుంచి 1986 వరకు నేషనల్ పార్క్ దళ కమాండర్ లంక పాపిరెడ్డి నాయకత్వం దళ సభ్యుడుగా కుంట, బస్తర్ ప్రాంతాల్లో పనిచేసాడు. 1987లో పార్టీ రూబెన్ ను ఏరియా కమిటీ సభ్యుడిగా ప్రకటించింది. 1991లో అనారోగ్యం కారణంగా చికిత్స కోసం కొత్తగుడెం కు వెళుతున్న సమయంలో చత్తీస్గఢ్ పోలీసులు అరెస్ట్ చేసి జగదల్పూర్ జైలు పంపించారు. 1992 లో జైలు నుంచి తప్పించుకున్న రూబెన్ తిరిగి మావోయిస్టు పార్టీ లో కలిసి ఏరియా కమిటీ సభ్యుడిగా కుంట, అబుజ్ మడ్ ప్రాంతాల్లో 1999 వరకు పనిచేసాడు. సెంట్రల్ కమిటీ సభ్యుడు రావుల శ్రీనివాస్ @ రామన్న గోపన్న నేతృత్వంలో బీజాపూర్ జిల్లా, గుండ్రాయి గ్రామానికి చెందిన పొడియం భీమేతో రూబెన్ కు వివాహం జరిపించారు. 2005 సంవత్సరం డివిజన్ కమిటీ సభ్యుడి పనిచేస్తున్న సమయంలో అనారోగ్యం కారణంగా పార్టీ ఆదేశాలతో రూబెన్ గుండ్రాయి గ్రామంలోనే భార్య, పిల్లలతో నివాసం వుంటూ, కోళ్లు, గొర్రెలు ఫారాలు నిర్వహిస్తూనే స్థానిక గ్రామ కమిటీలతో కలసి చురుకుగా పని చేసేవాడు. ముఖ్యంగా మావోయిస్టు సిద్దాంతాలకు కాలం చెల్లిపోవడం, ప్రజలకు మావోయిస్టులపై వ్యతిరేకత రావడంతో పాటు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న పురావాస పథకాల ద్వారా ప్రశాంతవంతమైన వాతావరణంలో తన కుటుంబ సభ్యలతో జీవించాలని, నిర్ణయించుకొని పోలీసుల ఎదుట రూబెన్ లొంగిపోయాడని సీపీ తెలియజేశారు. రూబెన్ పై 8లక్షల రూపాయల రివార్డ్ వుందన్నారు.



## విద్యార్థులకు దాతల చేయూత

**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** మంద రఘుపతి జ్ఞాపకార్థం వారి అల్లుడు కమటం శ్రీనివాస్ శ్రీలత హనుమకొండ వాస్తవ్యులు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలకుర్తి ప్రాథమిక పాఠశాలకు చేయూతనందించారు. విద్యార్థులకు 6000 రూపాయల విలువ గల మార్చ్ ఫాస్ట్ డ్రం, స్మాల్ డ్రం, కంజర , గజ్జెలు, 20 లెజిమ్స్ సమకూర్చగ.. మండల విద్యాశాఖ అధికారి పోతుగంటి నర్సయ్య పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిదురాల శ్రీనివాస్ కు మంగళవారం బహుకరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విజయ్ కుమార్, ఎం శ్రీనివాస్, ఎన్ శ్రీనివాస్, శ్రీలత, మంజుల పాల్గొన్నారు. వారికి పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శ్రీలత, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.



## వినయ్ భాస్కర్ కు నోటీసులు

**పాలకుర్తి వాణి, హనుమకొండ:** రైతులకు యూరియా ఇవ్వడం లేదని, రైతుల పక్షాన యూరియా కొరతకు నిరసనగా... గత నెలలో హనుమకొండ చౌరస్తాలో పార్టీ శ్రేణులతో కలిసి ధర్నా చేయగా... హనుమకొండ పోలీసులు భారాస కీలక నేతలపై కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన నోటీసులు అందించేందుకు ఎస్ఐ సదానందం మంగళవారం బాలసముద్రంలోని భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యాలయానికి వచ్చారు. రైతుల పక్షాన పోరాడితే కేసులు పెట్టడం ఏంటని దాస్యం వినయ్ భాస్కర్ ప్రశ్నించారు. ఎన్ని నోటీసులు ఇచ్చిన, కేసులు పెట్టినా రైతుల పక్షాన, ప్రజల పక్షాన పోరాడుతాం అని తెలిపారు. ప్రశ్నిస్తే పోలీసులు కేసులు పెడుతాం... అరెస్టులు చేస్తామంటే ఆగేది లేదన్నారు. ప్రజల తరపున కొట్లాడేది ఆపేది లేదని దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు.

## డీజీపీని కలిసిన మానుకోట ఎస్పీ

**పాలకుర్తి వాణి, మహబూబాబాద్:** తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీ శివధర్ రెడ్డిని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ హైదరాబాదులో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా లో శాంతిభద్రతలు, ఇతరాత్ర పరిస్థితులను ఎస్పీ డిజిపికి వివరించారు.



# పర్యాటక రంగ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

- **వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**
- **ఆలయాల అభివృద్ధిపై పురావస్తు శాఖ అధికారులతో సమీక్ష**



**పాలకుర్తి వాణి, హనుమకొండ :** వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పర్యాటక రంగ అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. మంగళవారం హనుమకొండలోని కనకదుర్గ కాలనీలోని తన కార్యాలయంలో పురావస్తు శాఖ అధికారులతో పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చారిత్రక ఆలయాలు, కాకతీయ వారసత్వ సంపదను పునరుద్ధరించాలంటూ పురావస్తు శాఖ అధికారులకు ఎంపీ సూచించారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాలంటే ఆలయాల పునరుద్ధరణ పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. వరంగల్ వేయి స్తంభాల ఆలయంలోని కల్యాణ మండపం మరమ్మతులు, విగ్రహ ప్రతిష్టాపన, శ్రీ భద్రకాళి ఆలయం, చిల్పూర్ లోని శ్రీ బుగులు వెంకటేశ్వరస్వామి ఆలయాల అభివృద్ధితో పాటు, భూపాలపల్లి జిల్లాలోని నపాక ఆలయం, కోటగుళ్లు, రెడ్డి గుడి ప్రత్యేక శిలలపై నిర్మితమైన ఆలయాల పునరుద్ధరణకు పైలెట్ ప్రాజెక్టు కింద పనులు వేగవంతం చేయాలని సూచించారు. అలాగే వరంగల్ కోటలో ఉన్న 14 ఆలయాలకు పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలన్నారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని శంబునిగుడి, గణపేశ్వర స్వామి దేవాలయం (కోటగుల్లు), ఏకవీర/ఎల్లమ్మ ఆలయం, రెడ్డి గుడి దేవాలయం, త్రికూట దేవాలయాలు, కోటబురుజులు (ద్వారాలు), సర్వయ్ పాపారాయుడు కోట, పాండవులు గుట్ట, సర్వతోభద్ర టెంపుల్,వేణుగోపాల స్వామి దేవాలయం,పద్మాక్షి ఆలయం, పంచకూటాలయాలను ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియాకు కేటాయిస్తే ఆలయాల అభివృద్ధి మరింత జరుగుతుందని వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకు వెళ్తానని ఎంపీ తెలిపారు. అనంతరం పురవస్తు శాఖ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి వేయి స్తంభాల ఆలయాన్ని ఎంపీ డా. కడియం కావ్య స్వయంగా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఆర్కియాలజిస్ట్ సూపరింటెండింగ్ నిహిల్ దాస్, అసిస్టెంట్ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ రోహిణి పాండే, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నాయకులతో ఎమ్మెల్యే
# సమీక్ష సమావేశం

**పాలకుర్తి వాణి, పెద్దవంగర :** మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల ముఖ్య నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికలపై పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి మంగళవారం పాలకుర్తిలోని క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎన్నికలపై దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అత్యంత కీలకమని, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల్లోకి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను వివరించాలని, ప్రజల నమ్మకం గెలుచుకోవడంతో అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. సమావేశంలో పెద్దవంగర నాయకులు పాల్గొన్నారు.



## బీసీ బిల్లుపై నేతలతో
# సీఎం మీటింగ్

**పాలకుర్తి వాణి,హైదరాబాద్ :** బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. బీసీలకు రిజర్వేషన్ కల్పించే అంశంపై అడుగడుగునా జాగ్రత్తలు చేపడుతున్న తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టు, హైకోర్టులోను కేసు గెలిచేందుకు తన సర్వశక్తులు ఒడ్డుతోంది.బీసీ రిజర్వేషన్ల అంశాన్ని సీరియస్ గా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం గంటగంటకు పరిస్థితిని అంచనా వేస్తూ ముందుకు వెళుతుంది.అక్టోబర్ 8న హైకోర్టులో బీసీ రిజర్వేషన్ కేసు విచారణ నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహం, చేపట్టాల్సిన చర్యలు తదితర అనుబంధ అంశాలను చర్చించేందుకు ఏకైక ఎజెండాతో మంగళవారం సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు.






# ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

**పాలకుర్తి వాణి, పాలకుర్తి:** వాల్మీకి మహర్షి జయంతిని జనగామ జిల్లా పాలకుర్తి మండలం వల్మీడి గ్రామంలోని పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి అందించిన మానవీయ విలువలు, ధర్మాచరణ, వంటి ఆదర్శ భావాల ఆచరణ నేటి సమాజానికి ముఖ్యమని వక్తలు విద్యార్థులకు వివరించారు. మన ఊరి చరిత్రను తెలుసుకొని కాపాడుకోవాలని ముఖ్య అతిథి కె.వి.జి. కె.ఆచార్య అన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, సోమనారాయణ, సోమేశ్వర్, చినసోమయ్య, కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



## రెండేళ్లలోపు చిన్నారులకు
# దగ్గు మందు ఇవ్వొద్దు
### రాష్ట్ర వైద్యశాఖ హెచ్చరిక



**పాలకుర్తి వాణి, హైదరాబాద్:** చిన్నారులకు దగ్గు, జలుబు రాగానే సిరప్‌ల వైద్యం ప్రమాదకరమని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించింది. పిల్లలకు దగ్గు మందుల వాడకంపై జాగ్రత్తలు పాటించాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ సూచనల మేరకు వైద్యులు, తల్లిదండ్రులకు వైద్య ఆరోగ్యశాఖ సోమవారం అడ్వయిజరీ జారీ చేసింది. రెండేళ్లలోపు బాలలకు దగ్గు మందు ఇవ్వొద్దని, ఐదేళ్లలోపు పిల్లలకూ సాధారణంగా సిరప్‌లు వాడొద్దని పేర్కొంది. ఐదేళ్లు దాటిన చిన్నారులకు అవసరమైన మేరకు వైద్యుల పర్యవేక్షణలో సరైన మోతాదులో తక్కువ కాలంపాటు సిరప్‌లు వినియోగించాలని సూచించింది. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు కూడా నాణ్యమైన తయారీ ప్రమాణాలతో కూడిన ఉత్పత్తులే రోగులకందించాలని కోరింది. ఇదిలా ఉంటే, 2025 మే నుంచి 2027 ఏప్రిల్ వరకూ గడువు గల ఎస్ఆర్ 13 బ్యాచ్ కోల్డ్రిఫ్ సిరప్‌ను వాడొద్దని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ హెచ్చరించింది. తమిళనాడులోని స్రేసన్ కంపెనీ తయారు చేసిన ఈ సిరప్ కలిగి ఉన్న వారు వెంటనే సమీప ఔషధ నియంత్రణ అధికారులకు అప్పగించాలని కోరింది. సంబంధిత ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ 18005996969 అందుబాటులోకి తెచ్చింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రులు, బోధనాస్పత్రులకు ఈ సూచనలను తెలపడంతోపాటు కఠినంగా అమలు చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించింది. దగ్గు మందుపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించాలని కోరింది.

Printed and Published by **DHEERAVATH SREENU NAIK** on behalf of DHEERAVATH SREENU NAIK, Printed at SHASHI PRINTING PRESS Flat No.58675/9/6, Ashok Nagar, Kamareddy, Tela gana, 503111., Published at 4-109/3, Palakurthy, Jangaon District. Telangana , 506252, editor DHEERAVATH SREENU NAIK. Ph : **9866366702**, RNI: TGTEL/25/A2341